# సుగుణ

-ఎం. ప్రభావతి

"అర్జెంటుగా ఓ రెండు వేలు కావాలి సుగుణా! హడా విడిగా వస్తూనే అడిగాడే విజయ్.

"డబ్బు కావాల్సినప్పుడు నేను గుర్తు వస్తాను కాబోలు?" అతని వైపు కోపంగా చూస్తూ అందీ సుగుణ.

"నిన్ను మర్చిపోతే కదా గుర్తు రావడానికి?" విజయ్ వెకిలిగా నవ్వుతూ ఏదో చెప్పబోయాడు. అతని మాటకడ్డు వస్తూ" ప్రస్తుతం నా దగ్గర డబ్బులేదు" కటువుగా చెప్పింది సుగుణ.

"పోనీ ఓ వెయ్యన్నా సర్దు సుగుణా ఏం చేస్తాను దానితోనే సర్దుకుంటాను మరి" ఇవ్వక చస్తావా! అనే భావంతో ఆమె వైపు ధీమాగా చూసేడు విజయ్.

"ఓ వెయ్యి కాదు కదా వెయ్యి పైసలు కూడా లేవు నా దగ్గర, ఓ వేళవున్నా ఇవ్వను, ఇప్పటికే నీకెంతో యిచ్చాను. ఇంకా ఇంకా ఇచ్చి నీ అప్పుని పెంచలేను అయామ్ సారీ" ఆమె గొంతు కఠినంగా పలికింది.

"నాకిచ్చిన డబ్బుని అప్పుగా జమకడ్తున్నావా డార్లింగ్, ఇదెప్పటి నుంచీ! నీవు నా కాబోయే భార్యా మణివి. త్వరలోనే మనం దంపతులం కాబోతున్నాము కూడా, భార్య డబ్బు భర్తది కాదా, అందులోనూ కట్నం కోరకుండా వస్తున్న భర్తని, మరెవరో నిన్ను చేసుకుంటే కట్నంగా మీ వాళ్ళు ఎంత ఇవాల్సి వస్తుందో తెలుసా?" అతని మాటల్లో వ్యంగ్యం, అహంకారం, 'నేను మగవాడిని, కట్నం అడిగే అధికారం హక్కు నాకున్నాయి అనే ధీమాగా వ్యక్తం అవుతుంటె సుగుణ కోపం, అసహ్యం, పొంగుకొస్తుంటే అతి కష్టంగా ఆ ఉద్రేకాన్ని అణచుకుంటూ "చూడు మిస్టర్ విజయ్, సారీ విజయగారూ మాటకు ముందు మీరు 'కట్నం కోరని భర్తను' అని డబ్బా చాటుకోనక్కర్లేదు. మరో మాట "మనం కాబోయే దంపతులం కాదు ఎందుకంటే నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలని అనుకోవడం లేదు. ముందు ఆ మాట తెలుసుకో, రెండో మాట ఇన్నాళ్ళు నీవు 'మా తమ్ముడికి పరీక్ష ఫీజు కట్టాలి' అని 'మా చెల్లెల్ని పురుటికి తీసుకురావాలి' అని 'మా అమ్మ వంట్లో బాగా లేదు. పెద్ద హాస్పటల్లో చేర్పించాలి' అంటూ తీసుకున్న డబ్బు మొత్తం అణాపైసలతో సహా నాకివ్వాలి తెలిసిందా! ఉద్యోగం చేసే ఆడపిల్ల ఎలా చెప్తే అలా వింటుంది అనుకుంటున్నావు కదా అదంతా నీ భ్రమ అని సరిదిద్దుకో.

సినిమాలకు, షికార్లకు ఓ ఆడది ఉద్యోగం చేస్తూ సంపాదించి చేతిలో పోయడానికి ఓ ఆడది, ఇంటి పట్టున వుండి వంట చేసి కడుపు నింపడానికి ఓ ఆడది కావాలని కోరుకునే నీలాంటి చపల చిత్తుడిని పెళ్ళిచేసుకుని జీవితమంతా బాధపడే కన్నా, అసలు పెళ్ళే చేసుకోకుండా వుంటె ఇలాగే వుండిపోతే ఎంతో మంచిది కాదా. ఇదే మని చివరి కలయిక, నన్నెప్పుడు కలుసుకోవడానికి ప్రయత్నించకు. వస్తా గుడ్‌బై" కోపంతో ఆ నాలుగు మాటలూ దులిపేసి విసురుగా వెళ్ళిపోయంది సుగుణ. వెళ్ళే ఆమెను చూస్తూ కోపంగా కసిగా పళ్ళు నూరుకున్నాడు విజయ్. 'నిన్ను వదలను, నీ అంతు చూడందే నిద్రపోను. నీ పెళ్ళి ఎలా జరుగుతుందో? ఎవరితో జరుగుతుందో చూస్తాగా, అసలు నీ పెళ్ళి జరగనిస్తే కదూ? ఉక్రోషంగా గొణుక్కుంటూ అంతే వేగంతో వెళ్ళిపోయాడు విజయ్.

సుగుణ, విజయ్ ఒకే ఆఫీసులో జాబ్ చేసేవారు. తనకి తెలియని ఆఫీసు విషయాల్లో సహాయం చేస్తూ ఆమెను ఆకట్టుకున్నాడు. అందంగా వుండడమే కాక సరదా మాటలతో ఆమెను నవ్విస్తూ, అప్పుడుప్పుడూ తనని సినిమాలకు తీసుకెళ్తూ, హోటల్‌కి తీసుకెళ్తూ, పెళ్ళంటూ చేసుకుంటే ఇతన్నే చేసుకోవాలి' అనే స్టేజికి సుగుణను తీసుకు వచ్చాడు విజయ్.

మనసులో ఓ నిశ్చయానికొచ్చిన సుగుణ, అతనితో 'హద్దులు మీరకుండా' నిస్సంకోచంగా, సినిమాలకు, షికార్లకు తిరిగేది. అతను డబ్బుకావాలని అడిగితే. లేదనకుండా అడిగినంతా డబ్బూ ఇచ్చేది.

అనుకోకుండా ఓ సారి విజయ్ ఎవరో అమ్మాయితో సినిమాహాల్లో కనిపించాడు. మరోసారి మరో అమ్మాయితో స్కూటర్‌మీద వెళ్తూ కనిపించేడు. బహు

శా వాళ్ళు అతని కజిన్స్ కాబోలు అని సమాధానం చెప్పుకుంది మనసుకి.

అతనితో పెళ్ళి విషయం తేల్చుకోవాలని ఓ ఆది వారం సాయంత్రం అతని రూముకి వెళ్ళింది. తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. లోపల్నించి మాటలు వినిపించడంతో అక్కడే ఆగిపోయి వాళ్ళమాటలు వినసాగింది.

"ఉద్యోగం చేసే ఆడదాన్ని పెళ్ళిచేసుకుంటె, డబ్బుకి ఇబ్బంది పడనక్కర్లేదు. వాళ్ళ పోషణ భారం మన మీద పడదు. పైగా వాళ్ళ సంపాదన మీద మనదే పెత్తనం" వెకిలిగా నవ్వుతూ చెప్తున్నాడు విజయ్. అవతలి వ్యక్తి ఎవరో కాని "నీకు మేనమామ కూతురితో నిశ్చితార్థం జరిగిందని విన్నాను మరి ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకోవా?" అని అడుగుతున్నాడు.

"ఎందుకు చేసుకోను. మహారాజులా చేసుకుంటాను. దానికి చదువాట్టే లేదు. వంట మాత్రం బ్రహ్మాండంగా చేస్తుంది. ఉద్యోగం చేసే ఆడవాళ్ళు రుచిగా వంటలు చేయలేరని నాకు తెలుసుగా, అందుకే వంట చేయడానికి ఒకరు, సంపాదిస్తూ సరదా తీర్చుకోవడానికి ఒకరూను, ఎలా వుంది నా ప్లాను" పకపక నవ్వుతూ చెప్తున్నాడు విజయ్

వింటున్న సుగుణకు వళ్ళు మండిపోతున్నది. లోపలికి వెళ్ళి నాలుగు దులిపేసి రావాలని ఉద్రేక పడింది. కాని వాళ్ళింకా ఏం మాట్లాడుకుంటారో విన్నాకే ఓ అభిప్రాయానికి రావచ్చని కోపాన్ని తమాయించుకుంది అతి కష్టంగా.

"రెండో భార్యగా ఒప్పుకుంటుందా నీ లవరు?" అతను అడిగేడు "పెళ్ళయితే చచ్చినట్లు వూరుకుంటుంది. వూరుకోక ఏం చేస్తుంది? ఏదోలా పెళ్ళయితే చాలు' అనుకునే ఆడవాళ్ళే ఎక్కువ మనసమాజంలో బ్రదర్" విజయ్ హేళనగా నవ్వుతూ చెప్తుంటే, అతని మాటలు వినలేక అక్కడ నుంచి తప్పుకుంది నెమ్మదిగా.

అతని దురాలోచన తెలిసినప్పటి నుంచి అతన్ని తప్పుకుని తిరగసాగింది. 'అతను సినిమాకు రమ్మన్నా, సరదాగా తిరిగొద్దాము' అని పిలిచినా ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటున్నది.

విజయ్ మాత్రం తన గుప్పిటలో చిక్కిన పక్షి ఎక్కడికి పోతుందిలే అనే ధీమాతో, నమ్మకంతో నిర్భయంగా ఉంటున్నాడు.

ఈ మధ్యలో ఆ ఆఫీసు నుంచి మానేసి మరో జాబ్ చూసుకుని వెళ్ళిపోయింది సుగుణ మరో ఆఫీసుకి. వెళ్ళే రోజున కూడా అతనితో చెప్పలేదు.

కొద్ది రోజులకే 'సుగుణ' పెళ్ళి చేసుకోబోతున్నదనే కబురు అతన్ని ఖంగారు పెట్టింది. 'తనని పెళ్ళి చేసుకోబోయే ఆ చవట సన్యాసి ఎవరబ్బా!' అని ఆశ్చర్య పడుతూ అతనికోసం ఆరా తీసేడు, ఎలాగైతేనేం అసలు వ్యక్తిని పట్టుకోగలిగాడు. అతనితో పరిచయం పెంచుకున్నాడు. ఆ చనువుతో ఓ రోజున గుట్టు తెలిసిన వాడిలా "మీరు పెళ్ళిచేసుకోబోయి అమ్మాయి మంచిది కాదు. లోగడ ఇద్దరు ముగ్గురు మగవాళ్ళని ప్రేమించినట్లు నటించి మోసం చేసింది, అటువంటి అమ్మాయిని మీరెలా పెళ్ళి చేసుకుంటారు?' అని అడిగేడు.

"ఈ విషయాలన్నీ మీకెలా తెలిసాయి? కొంపదీసి ఆమె ప్రేమికుల్లో మీరు ఒకరా?" అడి అడిగేడు అతను చిలిపిగా నవ్వుతూ.

ఆ ప్రశ్నకు దిమ్మరపోయిన విజయ్ తడబడుతూ " మా ఫ్రెండు చెప్పేడు లెండి" అన్నాడు నవ్వడానికి ప్రయత్నిస్తూ.

" మీ హెచ్చరికకు మెనీమెనీ థాంక్స్ సార్, ఈ రోజుల్లో మంచికోరి చెప్పే వాళ్ళు ఎవరున్నారు? మీ మేలు మరిచిపోలేను కాని, ఓ విషయం మాత్రం మీకు చెప్పక తప్పదు నేను పెళ్ళి చేసుకోబోయే అమ్మాయి నా చెల్లెలు ఫ్రెండు. ఆ అమ్మాయి గురించి నా చెల్లెలికి బాగా తెలుసు. అదీగాక ఆ అమ్మాయి నాకంతా చెప్పింది. తను ప్రేమించడం, అవతలి వ్యక్తి ప్రేమించినట్లు నటించడం, అది తెలిసి తను ఆ వలయం నుంచి తప్పించుకోవడం' నిజాన్ని నిర్భయంగా చెప్పగలిగిన ఆమె నిజాయితీని ధైర్యాన్ని ఎవరూ మాత్రం మెచ్చుకోకుండా వుంటారు? మనం కూడా ఎందరో అమ్మాయిలను ప్రేమించినట్లు నటిస్తాము జీవితంలో? కాని ఆ విషయాన్ని నిర్భయంగా ధైర్యంగా చెప్పగలమా కాబాయే భార్యతో చెప్పలేము కాని ఆమె నన్ను మోసగించాలనుకోలేదు. అందుకే ఆమెను పెళ్ళిచేసుకోవాలని నిర్ణయించుకున్నాను. మా పెళ్ళికి మీరు తప్పకుండా రావాలి 'వస్తారు కదూ?' అన్నాడు అతను బ్యాగ్‌లోంచి 'శుభలేఖ' తీసి అతని చేతిలో పెడ్తూ.

తన ప్లాను ఫలించనందుకు చిన్నబోతూ అతనిచ్చిన 'శుభలేఖ'ను అయిష్టంగా అందుకున్నాడు విజయ్.

■